క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏఈ శంకరరావు

నరసన్నపేట: ప్రస్తుతం గ్రామాల్లో పెండింగ్ ఉన్న పక్కా గృహాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ శంకర రావు అన్నారు. నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పరిస్థితిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. సొంత స్థలాలు, ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. నరసన్నపేట, పోలాకి ఎంపీడీఓలు రామకృష్ణ, ఉషశ్రీ పాల్గొన్నారు.

మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడిగా గిరి



గిరికి ధ్రువీకరణపత్రాన్ని అందిస్తున్న ఏడీ సంతోష్‌కుమార్

హిరమండలం: మండలంలోని పెద్దసంకిలికి చెందిన శ్రీప్రేమ సాయి సుధా ఎస్సీ మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా చింతాడ గిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను శ్రీకాకుళం మత్స్యకారశాఖ ఏడీ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గిరికి ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఫిషరీష్ ఈఎఫ్ రమేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఓటర్ల జాబితా సిద్ధం



ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న హెచ్ఎం ఎం.కె.మిశ్రో

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 8వ తేదీన జరగనున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను సిద్ధం చేశామని హెచ్ఎం ఎం.కె. మిశ్రో శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 5న ఓటర్ల జాబితాల్లో అభ్యంతరాలు స్వీకరణ జరుగుతుందన్నారు. ఈ నెల 8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక, సభ్యులతో ప్రమాణ స్వీకరణ, మొదటి సమావేశం ఉంటుందన్నారు. ఇప్పటికే పాఠశాల వద్ద ఓటర్ల జాబితాను ప్రచురించామని, వాటిని పరిశీలించి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



డాన్స్ చేస్తున్న విద్యార్థినులు

నరసన్నపేట: ప్రతి విద్యార్థికీ ఇంటర్‌మీడియట్ దశ కీలకమని, ఈ రెండేళ్లు చదువుపై దృష్టి పెట్టాలని విశ్రాంత ఆర్ఐఓ రుక్మాంగధర రావు అన్నారు. స్థానిక జ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రుక్మాంగధరరావు మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దన్నారు. బాగా చదవుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల యాజమాన్య ప్రతినిధులు రంగారావు, నిరంజనరావు, ప్రిన్సిపాల్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో పంటలకు మేలు



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆమదాలవలస: జీవామృతంతో పంటలకు ఎంతో మేలు కలగనుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్ అన్నారు. మండలంలోని చేపేనపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి జీవామృతం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. యూనిట్ ఇన్‌చార్జి నక్క చిరంజీవి ఆధ్వర్యంలో 200 లీటర్ల జీవామృతాన్ని తయారు చేయించారు. పంట వేసిన పది రోజుల నుంచి జీవామృతాన్ని వేయడం వల్ల ప్రధానంగా పంటకు అవసరమైన పోషకాలు లభించడంతోపాటు నేల సారవంతంగా మారుతుందన్నారు. పంటకు ఎటువంటి ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా కేవలం జీవామృతాన్ని అందించడం ద్వారా మంచి దిగుబడులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

● నారు కష్టాలు..



ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగు చేస్తున్న రైతులకు నారు కష్టాలు వెంటాడుతున్నాయి. ఖరీఫ్ వరి విత్తనాలు వేసుకున్న నెల రోజులకే వర్షాలు కురిసి వరదలు ముంచెత్తాయి. ఎల్.ఎన్.పేట మండలంలోని తురకపేట, దబ్బపాడు, ధనుకువాడ, కోవిలాం, రావిచంద్రి, పెద్దకోట, సిద్ధాంతం, వాడవలస, మిరియాపల్లి, ముంగెన్నపాడు, చింతలబడవంజ, చిట్టిమండలం, శ్యామలాపురం తదితర గ్రామాల పరిధిలోని 366 హెక్టార్లలో వరి వెదలు నీట మునిగి కుళ్లిపోయాయి. ఈ పొలాల్లో నాట్లు వేసేందుకు పక్క మండలాలకు, సుదూర ప్రాంతాలకు వెళ్లి నారు కొనుగోలు చేసుకుని ఆటోల్లో తీసుకువస్తున్నారు. పంట నష్టం జరిగిన రైతులను గుర్తించి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందివ్వాలని కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

● పేరుకుపోయిన గుర్రపుడెక్క



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఎల్.ఎన్.పేట మండలం శ్యామలాపురం ఏబీ రోడ్డు వంతెన వద్ద వంశధారకు ప్రధాన కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క. హిర మండలం, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, శ్రీకాకుళం రూరల్, గార మండలాలకు చెందిన సుమారు 80 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఈ కాలువలో సాగునీటి ప్రవాహం తగ్గింది. అధికారులు స్పందించి గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

● మట్టివేశారు..



నరసన్నపేట మేజరు పంచాయతీలోని శివారు వీధి విజయలక్ష్మీనగర్ రోడ్డును పంచాయతీ సిబ్బంది శుక్రవారం బాగుచేశారు. సాక్షిలో రోడ్డు దుస్థితిపై వార్త ప్రచురితం కావడంతో పంచాయతీ ఈఓ చిన్నారావు స్పందించారు. వీధిలోని నీరు బయటకు వెళ్లే పైపులైన్‌ను మరమ్మతులు చేయించారు. రోడ్డుపై మట్టి వేయించి రాకపోకలకు వీలుగా చర్యలు తీసుకున్నారు. విజయలక్ష్మీనగర్ వాసులు ఆనందం వ్యక్తం చేశారు.

– నరసన్నపేట

శాశ్వత పరిష్కారమెప్పుడు?

- లోతట్టు భూముల్లో ఏటా నష్టపోతున్న రైతులు
- చినుకుపడితే నీట మునుగుతున్న వరి పొలాలు
- తంపర భూముల రైతుల ఆందోళన
- అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్న రైతులు



మడపాం-దేవాది మధ్య నీట మునిగిన వరి పొలాలు (ఫైల్)

నరసన్నపేట: ఖరీఫ్‌లో ఆరుగాలం శ్రమించిన తంపర భూముల రైతులకు ఏటా నష్టాలు తప్పడం లేదు. ఏమాత్రం వర్షం కురిసినా లోతట్టు భూములు నీటి మునుగుతున్నాయి. ఏళ్ల తరబడి ఈ సమస్య ఉన్నా.. ప్రభుత్వాలు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టటం లేదు. నరసన్నపేట, సారవకోట, పోలాకి, జలుమూరు మండలాల్లోని లోతట్టు భూములు ముంపునకు గురవుతున్నాయి. చిన్నపాటి వర్షం పడినా నీరు పొలాల్లో నిలుస్తుంది. కాలువలు ఆక్రమణలకు గురికావడం, పూడిక తీత సక్రమంగా నిర్వహించకపోవడంతో వర్షాల సమయంలో ఎగువ నుంచి వస్తున్న నీరు దిగువకు వెళ్లేడం లేదు. రోజుల తరబడి నీరు పొలాల్లో ఉండిపోతుంది. నియోజకవర్గంలో 3,500 ఎకరాల వరకు పొలాలు నీట మునుగుతున్నట్లు వ్యవసాయ అధికారుల అంచనా. వంశధార అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

నరసన్నపేట మండలంలో మామిడివలస, చిక్కాలవలస, కుద్దాం, కంబకాయ, నర్సింగపల్లి, బొరిగివలస, రావులవలస, మడపాం, చింతువానిపేట, ఉర్లాం తదితర గ్రామాల్లో ఏటా 600 ఎకరాల వరకు వరి పొలాలు నీట మునుగుతున్నాయి.

- జలుమూరు మండలంలో కూర్మనాథపురం, తాళ్ల వలస, అచ్యుతాపురం, యలమంచిలి, గుగ్గిలి, గండువలస, పాగోడు, కరవంజ, మర్రివలస, నగిరికటకంల్లో వరి పొలాలు ఏటా ముంపునకు గురవుతున్నాయి.
- పోలాకి మండలంలో సుసరాం, డీఎల్‌పురం, అంప్లాం, గుప్పెడిపేట, గుల్లవానిపేట, కొత్తరేవు, ప్రియాగ్రహారం గ్రామాల్లో అధిక వర్షాలకు పంటలు ఏటా మునుగుతున్నాయి.
- సారవకోట మండలంలో మాలువ, నవతల గ్రామాల్లో ముంపు సమస్య ఉంది.

శాశ్వత స్థాయిలో పరిష్కారం చూపాలి



మామిడివలస, కుద్దాం, కంబకాయ, నర్సింగపల్లి తదితర గ్రామాల్లో ముంపు సమస్య అధికంగా ఉంటుంది. ఏటా ముంపునకు పొలాలు గురవుతున్నాయి. వర్షం నీరు రోజుల తరబడి ఉండపోతుంది. కిందకు కాలువల ద్వారా నీరు వెళ్లకపోవడం వల్ల సమస్య తీవ్రం అవుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి శాశ్వత స్థాయిలో పరిష్కారం చూపితే అనేక మంది రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– ఎం.లక్ష్మనాయుడు, రైతు, చిక్కాలవలస, నరసన్నపేట మండలం

ఎన్‌హెచ్ ఇంజినీర్ల పొరపాట్లు శాపంగా మారింది



జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డు కింద సరైన పద్ధతిలో కల్వర్టులు వేయకపోవడంతో నీరు కిందకు వెళ్లడం లేదు. వర్షం పడిందంటే నీరు పొలాల్లోనే నిల్వ ఉంటుంది. ఈ సమస్యను పలుమార్లు ఎన్‌హెచ్ ఇంజినీర్లు దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం కనిపించలేదు. రైతులకు మాత్రం ఏటా నష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– కనలప శేఖరరావు, రైతు, పోతయ్యవలస, నరసన్నపేట మండలం

కూటమి ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి

ఆమదాలవలస : ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి అన్నారు. శుక్రవారం ఆమదాలవలస మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం తాత్సారం చేయకుండా హామీలు అమలు చేయాలన్నారు. ఆర్థిక శ్వేత పత్రంలో ఐదేళ్లగా రూ.21,980 కోట్ల పెండింగ్ బకాయిలు ఉద్యోగులకు రావాల్సి ఉందని ప్రకటించారని, కానీ వాటి విడుదలపై ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. 11వ వేతన సవరణ బకాయిలు, మెరుగైన వేతన సవరణ, 117 ఉత్తర్వుల రద్దు, సీపీఎస్ రద్దు హామీలను నిలబెట్టుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి పి.తమ్మినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖాధికారులు పాఠశాల విద్యాశాఖలో వివిధ కేటగిరీలలో పెద్దఎత్తున మిగులు పోస్టులు ఉన్నట్టు ప్రకటనలు చేశారని, వాస్తవానికి ప్రాథమిక తరగతుల విలీనం, తెలుగుమీడియం రద్దు కారణంగా మిగిలిన పోస్టులు తప్పఅవన్నీ మిగులు పోస్టులు కావని తెలియజేశారు. ఆరువేల పోస్టులు పదోన్నతుల ద్వారా నింపుతామని విద్యాశాఖ మంత్రి ప్రకటించారని, వెంటనే షెడ్యూల్ విడుదల చేసి పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలుగు మీడియం కొనసాగింపు, యాప్‌ల రద్దు, హెల్త్ కార్డు సమస్యల పరిష్కారం, కేజీబీవీ ఉద్యోగులకు టైంస్కేల్ వర్తింపు, సమగ్రశిక్ష ఉద్యోగులకు నెలవారీ జీతాలు చెల్లింపు, అంబేడ్కర్ గురుకుల ఉద్యోగులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జి.రమణ, అన్నాజీ బాబు, రామచంద్ర, రమేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తుల తయారీకి రాయితీ సౌకర్యం



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం కూర్మారావు

ఆమదాలవలస: మహిళా స్వయం శక్తి సంఘాల్లో పంచ సూత్రాలు పాటిస్తూ.. గ్రేడ్-ఏలో ఉన్న సంఘ సభ్యురాలికి ఆహార ఉత్పత్తుల తయారీ కోసం ఆర్థిక ప్రయోజనాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీఎం పైడి కూర్మారావు తెలిపారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్యలో అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న ఏ వస్తువు తయారీ యూనిట్ అయినా పెట్టుకుంటే 35 శాతం సబ్సిడీతో కూడిన రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. పి.ఎం.ఎఫ్.ఎం.ఈ (మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్), పి.ఎం.ఈ.జీ.పి (ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం)ల ద్వారా బ్యాంక్ కన్సెంట్‌తో గ్రౌండింగ్ చేయనున్నట్లు తెలిపారు. స్వయం శక్తి సంఘంతోపాటు గ్రామ సంఘం ఆమోదిస్తే ఆ మహిళా ఎంటర్‌ప్రైజర్‌కు రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాన్ని డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ఆధారంగా మంజూరు చేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ప్రతి మహిళా సంఘం కూడా ముందుగా సభ్యుల సేవింగ్స్ ఖాతాలో ఉన్న నిల్వలను సంఘం ఆమోదంతో, అవసరమైన సభ్యురాలికి ప్రాథమికంగా పొదుపు నుంచి అప్పులు, గ్రామ సంఘం ద్వారా శ్రీనిధి అప్పులు మంజూరు చేయించాలని సూచించారు. ఈ నిధులు సంఘ సభ్యులందరికీ సరిపోనప్పుడు మైక్రో క్రెడిట్ ప్లాన్ తయారుచేసుకుని యాక్టివిటీ బేస్డ్ బ్యాంక్ రుణాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో ఆర్డినేటర్ సుభద్ర, చందరరావు, వీఓఏలు పాల్గొన్నారు.

పశుగణన సక్రమంగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 21వ అఖిల భారత పశుగణన (లెక్కింపు)ను సక్రమంగా నిర్వహించాలని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. స్థానిక కోర్టు కూడలిలో ఉన్న పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయంలో పశుగణనపై క్షేత్రస్థాయి సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు పశుగణన కార్యక్రమంలో పాల్గొని కచ్చితమైన వివరాలు సేకరించాలని ఆదేశించారు. ప్రతి విషయ సేకరణదారుడు (ఎన్యూమురేటర్) రోజుకు 30 నుంచి 35 ఇళ్లకు సంబంధించిన పశువుల వివరాలు సేకరించాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ముద్ద చర్మ వ్యాధి టీకాలు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభిస్తామన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల కోసం అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు సేకరించాలన్నారు. ఈ సమావేశంలో పశువైద్యులు పి.అనిల్‌కుమార్, బి.శ్రీవాణి, కె.మౌనిక, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు హర్షణీయం



మీనాక్షీదేవి

పాతపట్నం: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుతాలకు అధికారం కల్పిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ జెడ్పీటీసీ సీమ మీనాక్షీ దేవి, ఎస్సీ సెల్ రాష్ట్ర సెక్రటరీ సీమ రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనల విడుదల చేశారు. రిజర్వేషన్ల ఫలాలు వెనుకబడిన వర్గాల వారందరికీ సమానంగా అందాలనే ఆకాంక్షను ఈ తీర్పు నెరవేర్చనుందన్నారు.

బాధ్యతల స్వీకరణ

మెళియాపుట్టి: స్థానిక తహసీల్దార్‌గా నందిగాం హనుమంతురావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో సారవకోట మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛంతో ఆహ్వానించారు.

హిరమండలం: స్థానిక తహసీల్దార్‌గా బి.వెంకరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ బి.సుధాకర్ విశాఖకు బదిలీపై వెళ్లడంతో అనకాపల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. తహసీల్దార్‌కు ఉప తహసీల్దార్ వెంకటరమణ, మండల సర్వేయర్, వీఆర్వోలు, వీఆర్ఏలు, సచివాలయ సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

విద్యాలయం దేవాలయంతో సమానం

సరుబుజ్జిలి: విద్యాలయాలు దేవాలయాలతో సమానంగా భావించి ఉపాధ్యాయులు పని చేయాలని ఎంఈఓ-2 కె.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. పాఠశాల ఆవరణతోపాటు, విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల మౌలిక సదుపాయాలు గురించి చర్చించి ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రతీ అంశంలో హెచ్ఎం పర్యవేక్షణ ఉండాలన్నారు.

వాడీవేడిగా ఉపాధి గ్రామసభ



సభలో వాదులాడుకుంటున్న గ్రామస్తులు

సరుబుజ్జిలి: మండలంలోని బప్పడాం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభ వాడీవేడిగా సాగింది. ఇటీవల గ్రామంలో ఆడిట్ బృందం సభ్యులు ఇటీవల సేకరించి వివరాలను సోషల్ ఆడిట్ డీఆర్పీ కె.కృష్ణ సభలో చదివి వినిపించారు. జాబ్‌కార్డులు అప్‌డేట్ కాకపోవడం, మస్తర్లలో సంతకం లేకపోవడం, హాజరులో దిద్దుబాట్లు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామని వెల్లడించారు.

ఏకపక్షంగా ఆడిట్‌లో తనపై తప్పుడు ఫిర్యాదులు చేశారని, ఉపాధి పనికి వచ్చిన వేతదారునికి మాత్రమే మస్తర్లు వేశానని, ఎటువంటి దిద్దుబాట్లు చేయలేదని ఫీల్డ్‌అసిస్టెంట్ పేడాడ వెంకన్న సభ దృష్టికి తెచ్చారు. దీంతో సభలో గ్రామస్తుల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. కొంతసయం గందరగోళం నెలకొంది. స్థానిక ఎస్ఐ బి.నిహార్, పోలీసులు రంగప్రవేశం చేసి సభను సజావుగా కొనసాగించారు. ఈ సమావేశంలో స్థానిక సర్పంచ్ భర్త పేడాడ వెంకటరమణ, ఉపాధి హామీ ఈసీ సి.హెచ్.రమాదేవి, పంచాయతీ కార్యదర్శి, సోషల్ ఆడిట్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

పింగళి తెలుగు వ్యక్తి కావడం గర్వకారణం



సారవకోట: పింగళి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠశాల డైరెక్టర్, సిబ్బంది, విద్యార్థులు

నరసన్నపేట: స్వాతంత్ర్య సమర యోధుడిగా, విద్యావేత్తగా మంచిపేరు పొందిన పింగళి వెంకయ్య తెలుగు వ్యక్తి కావడం దేశ స్థాయిలో మనకు గుర్తింపు తీసుకువచ్చారని నరసన్నపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.లత అన్నారు. పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా కళాశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత జాతీయ పతాక రూపకర్తగా మంచి గుర్తింపు పొందారన్నారు. జియాలజిస్టుగా, బహుభాషా కోవిదునిగా పేరు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్, చరిత్ర అధ్యాపకులు పి.అన్నాజీరావు, విద్యార్థులు వివరించారు.



నరసన్నపేట: పింగళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

జాతీయ జెండా రూపకర్తకు నివాళి..

సారవకోట: మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాలలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని శుక్రవారం నిర్వహించారు. పింగళి చిత్రపటానికి పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ, సిబ్బంది పూలమాలలు వేసి నివాళుల్పించారు. విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకుని నినాదాలు చేశారు. జాతీయ జెండాలో మూడు రంగుల ఆవశ్యకతను పాఠశాల డైరెక్టర్ వివరించారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం

తల్లిపాలు అమృత సమానమని, పుట్టిన శిశువుకు వెంటనే తల్లిపాలు ఇవ్వడం ద్వారా వారిలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సిబ్బంది తెలిపారు. నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల్లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో తల్లిపాల వారోత్సవాలు రెండు రోజు శుక్రవారం కూడా కొనసాగాయి. తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు. బిడ్డ ఎదుగుదలకు, సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో మేలు చేస్తాయన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు పాలు, గుడ్లు, చక్కీలు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: సోధ గ్రామంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ విమలారాణి



కొత్తూరు: నివగాం జెడ్పీహెచ్ఎస్‌లో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌస్యబేగం



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో అవగాహన కల్పిస్తున్న స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జ్యోతిర్మయి



ఆమదాలవలస: అవగాహన కల్పిస్తున్న ఆమదాలవలస ఐసీడీఎస్ పీఓ అనురాధ



నరసన్నపేట: కొల్లవానిపేటలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీఓ నాగమణి

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



విచారణ చేపడుతున్న ఉపాధి హామీ ఏపీడీ లోకేష్, తదితరులు

ఆమదాలవలస: మండలంలోని సైలాడ గ్రామ పంచాయతీ పరిధి ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్‌పై దివంజిపేటలో శుక్రవారం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లోకేష్, అధికారులు విచారణ చేపట్టారు. ఉపాధి హామీ పథకంలో గత కొంతకాలంగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సతీష్‌పై వేతనదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేశారు. గ్రామంలోని తన బంధువులు పనిలోకి రాకపోయినా ఫీల్డ్ అసిస్టెంట్ మస్తర్లు వేసినట్లు కొంతమంది వేతనదారులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వ్యక్తిగత కారణాలతో తనపై తప్పుడు ఫిర్యాదు చేస్తున్నారని ఫీల్డ్‌అసిస్టెంట్ సమాధానం ఇచ్చారు. గ్రామసభలో ఉన్న రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు ఘర్షణకు దిగారు. పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేయడంతో ఘర్షణ సద్దుమనిగింది. అనంతరం ఏపీడీ లోకేష్ ఇరువర్గాలకు చెందిన వేతనదారుల అభిప్రాయాలను రాతపూర్వకంగా రికార్డ్ చేశారు. ఏపీడీ లోకేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ వేతనదారుల ఫిర్యాదు మేరకు తాను విచారణ చేశానన్నారు. ఇక్కడ జరిగిన అంశాలను డ్వామా పీడీకి నివేదించనున్నట్లు తెలిపారు. ఏపీఓ లక్ష్మి, సర్పంచ్ సైలాడ దాస్‌నాయుడు, టీఏ సుధాకర్ పాల్గొన్నారు.